బలగం TV
BALAGAM
నిజమే మా బలం.. ప్రజలే మా బలగం
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ శుక్రవారం 22 నవంబర్ 2024 | www.balagamtv.com | పేజీలు 5


## ప్రధాని మోడీకి మరో రెండు పురస్కారాలు

బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో




భారత ప్రధాన మంత్రినరేంద్ర మోడీకి మరో అరుదైన గౌరవం లభించింది. గయానా, డొమినికా దేశాలు ప్రధానిని తమ అత్యున్నత పురస్కారాలతో సత్కరించాయి. ప్రస్తుతం గయానా పర్యటనలో ఉన్న మోడీ ఈ రెండు పురస్కారాలను అందుకున్నారు. ప్రపంచ దేశాలకు మోడీ అందిస్తున్న సహాయ సహకారాలకు గాను, గయానా కూడా తమ దేశ అత్యున్నత పురస్కారం 'ది ఆర్డర్ ఆఫ్ ఎక్స్ లెన్స్'ను ప్రకటించింది. ఈ అవార్డును ఆ దేశాధ్యక్షుడు మహమ్మద్ గురువారం భారత ప్రధానికి అందించారు. ఈ అత్యున్నత పురస్కారం స్వీకరించిన నాలుగో విదేశీ నేత మోడీనే కావడం విశేషం. అంతకు ముందు డొమినికా కూడా ప్రధానికి పురస్కారాన్ని అందజేసింది. కొవిడ్ తమ దేశానికి భారత్ అందించిన సహకారాన్ని గుర్తిస్తూ ఆ దేశాధ్యక్షురాలు సిల్వానీ బర్టన్, ప్రధాని మోడీని గురువారం డొమినికా అవార్డ్ ఆఫ్ఆనర్‌తో సత్కరించారు. ఈ సందర్భంగా రెండు దేశాలకు మోడీ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ పురస్కారాలను కోట్లాది మంది భారతీయులకు అంకితం చేస్తున్నట్టు తెలిపారు



# డిసెంబర్ 9 నుంచి అసెంబ్లీ

- ఆర్వోఆర్ చట్టం, కులగణనపై చర్చ
- మూసీ ప్రక్షాళన, హైడ్రాపై సభలో వివరించనున్న ప్రభుత్వం
- రైతు భరోసా, పింఛన్ల పెంపుపైన తీర్మానించే అవకాశం

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో అసెంబ్లీ శీతాకాల సమావేశాలకు ముహూర్తం ఖరారైంది. డిసెంబర్ 9వ తేదీ నుంచి అసెంబ్లీ శీతాకాల సమావేశాలు ప్రారంభం కానున్నాయి. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏర్పడి డిసెంబర్ 7తో సంవత్సరం పూర్తవుతున్న నేపథ్యంలో నిర్వహించే ఈ అసెంబ్లీ సమావేశాలు ప్రాధాన్యత సంతరించుకోనున్నాయి. గత జులైలో శాసనసభ శీతాకాల సమావేశాలను నిర్వహించిన సంగతి విదితమే. అప్పటి నుంచి నాలుగు నెలల తర్వాత డిసెంబరులో శాసనసభ, మండలి కొలువుదీరనున్నాయి. ఈ సమావేశాల్లో రీజనల్ రింగ్ రోడ్డు (ఆర్వోఆర్) చట్టం, కుల గణన, మూసీ ప్రక్షాళన, హైడ్రా తదితర కీలకాంశాలపై చర్చించే అవకాశముంది. రైతు భరోసా, రుణమాఫీ కూడా చర్చకు రానున్నాయని అసెంబ్లీ వర్గాలు తెలిపాయి. సమావేశాల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేయాలంటూ మండలి చైర్మెన్, శాసనసభ స్పీకర్... సంబంధిత అధికారులను ఆదేశించారు.

సమావేశాల్లో ప్రధానంగా.. రెవెన్యూ సంస్కరణల్లో కీలకమైన ఆర్వోఆర్ చట్టాన్ని అసెంబ్లీలో ఆమోదించనున్నట్టు తెలుస్తోంది. ఈ ఆర్వోఆర్ చట్టం ద్వారా భూ సమస్యలకు చెక్ పెట్టొచ్చని రేవంత్ రెడ్డి సర్కార్ భావిస్తోంది. వీటితో పాటు.. సర్కార్ ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన కులగణనపై చర్చించి ఆమోదించనున్నారు. దీని ఆధారంగానే స్థానిక సంస్థల రిజర్వేషన్లను కూడా ప్రభుత్వం నిర్ణయించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. మరోవైపు.. ఈ సమావేశాల్లోనే రైతు భరోసాతో పాటు ఆసరా పింఛన్ల పెంపుపైనా అసెంబ్లీలో తీర్మానించనున్నట్టు సమాచారం.

మరోవైపు మహారాష్ట్ర ఎన్నికల ఫలితాల అనంతరం మంత్రివర్గ విస్తరణ చేపట్టనున్నట్టు సమాచారం. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి డిసెంబరు ఏడు నాటికి ఏడాది పూర్తవుతుంది. ఈలోపే పూర్తి స్థాయిలో క్యాబినెట్‌ను విస్తరించాలని నిర్ణయించారని తెలిసింది. ఇదే సమయంలో పంచాయతీ ఎన్నికలపై కూడా సీఎం దృష్టి సారించారు. రాష్ట్రంలో కుల గణన పూర్తయిన తర్వాత ఆ ఎలక్షన్లను నిర్వహించేందుకు రేవంత్ సమాలోచనలు చేస్తున్నారు. ఈ క్రమంలో కుల గణన, పంచాయతీల్లో రిజర్వేషన్లకు సంబంధించి కూడా అసెంబ్లీలో విస్తృతంగా చర్చిస్తారని సమాచారం.

రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిణామాల నేపథ్యంలో డిసెంబరులో నిర్వహించబోయే అసెంబ్లీ సమావేశాలు... వాడివేడిగా కొనసాగనున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్, బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్‌రావు విమర్శలు, ప్రతి విమర్శల నేపథ్యంలో సమావేశాలు మరింత హీటెక్కనున్నాయి

### మాజీ సీఎం కేసీఆర్ వస్తారా..

ఈ అసెంబ్లీ సమావేశాలకైనా మాజీ సీఎం, ప్రధాన ప్రతిపక్ష నేత కేసీఆర్ హాజరవుతారా అన్న ఉత్కంఠ కొనసాగుతోంది. బడ్జెట్ సమావేశాల సమయంలో ఒక్క పూట మాత్రమే సభకు వచ్చిన ఆయన.. మళ్లీ రాకపోవటం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. అయితే.. ప్రజా పాలనా- ప్రజా విజయోత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న సభల్లోనూ సీఎం రేవంత్ రెడ్డి.. కేసీఆర్‌ను అసెంబ్లీకి రావాలంటూ ప్రతి వేదికపై నుంచి సవాళ్లు విసురుతున్నారు. మరి ఈసారి అయినా కేసీఆర్ అసెంబ్లీకి వస్తారా.. లేదా వేచి చూడాల్సిందే.

# గౌతమ్ అదానీపై అమెరికా కేసు

- కుప్పకూలిన అదానీ గ్రూప్ స్టాక్స్
- ఒక్కరోజే రూ. 2 లక్షల కోట్ల నష్టం



బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో

దేశంలో రెండో అత్యంత ధనవంతుడు, దిగ్గజ అదానీ గ్రూప్ అధినేత గౌతమ్ అదానీపై అమెరికాలో కేసు నమోదైంది. మల్టీబిలియన్ డాలర్ల లంచం, మోసానికి పాల్పడినట్టు గౌతమ్ అదానీ, ఆయన బంధువు సాగర్ అదానీ సహా మరో ఏడుగురు ఈ స్కీంలో నిందితులుగా ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ మేరకు ప్రముఖ అంతర్జాతీయ రాయిటర్స్, బ్లూమ్‌బర్గ్ వార్తా సంస్థలు నవంబర్ 21న నివేదించాయి. సోలార్ ఎనర్జీ కాంట్రాక్టుల్ని దక్కించుకునేందుకు ఈ క్రమంలోనే అదానీ గ్రూప్.. భారత ప్రభుత్వ అధికారులకు పెద్ద మొత్తంలో లంచాలు ఇవ్వజూపినట్టు అభియోగాలు మోపారు. ఇటీవల గౌతమ్ అదానీ.. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో గెలిచిన డొనాల్డ్ ట్రంప్‌కు శుభాకాంక్షలు తెలిపిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే తాజాగా ఆయనపై అక్కడ కేసు నమోదవడం చర్చనీయాంశంగా మారింది.

### కుప్పకూలిన అదానీ గ్రూప్ స్టాక్స్

: అదానీ గ్రూప్ సంస్థల చైర్మన్ గౌతమ్ అదానీతో పాటు మరో ఏడుగురు సీనియర్ బిజినెస్ ఎగ్జిక్యూటివ్ లు బిలియన్ డాలర్ల లంచం ఇవ్వజూపారని న్యూయార్క్ లో అభియోగాలు నమోదు కావడంతో అదానీ గ్రూప్ షేర్లు నవంబర్ 21న గణనీయమైన నష్టాలను చవిచూశాయి.ఫ్లాగ్ షిప్ సంస్థ అదానీ ఎంటర్ ప్రైజెస్ తో సహా దాదాపు అన్ని అదానీ గ్రూప్ సంస్థల షేర్లు గురువారం, నవంబర్ 21న స్టాక్ మార్కెట్లో భారీ నష్టాలను చవిచూశాయి. ప్రారంభ ట్రేడింగ్ లోనే లోయర్ సర్క్యూట్లను తాకాయి. కోట్లాది డాలర్ల లంచం, మోసం కేసులో గౌతమ్ అదానీపై న్యూయార్క్ లో అభియోగాలు నమోదైన సంగతి తెలిసిందే. సోలార్ ఎనర్జీ కాంట్రాక్టులు దక్కించుకునేందుకు భారత ప్రభుత్వ అధికారులకు 250 మిలియన్ డాలర్లకు పైగా లంచాలు ఇస్తామని అదానీ ప్రతినిధులు హామీ ఇచ్చినట్లు అమెరికా అధికారులు తెలిపారు.

తప్పుడు, తప్పుదోవ పట్టించే సమాచారం ఆధారంగా అమెరికా పెట్టుబడిదారులు, అంతర్జాతీయ ఆర్థిక సంస్థల నుంచి నిధులు పొందడానికి ప్రయత్నించారని భారత పునరుత్పాదక ఇంధన సంస్థ (ఇండియన్ ఎనర్జీ కంపెనీ) ఎగ్జిక్యూటివ్ లు గౌతమ్ అదానీ, సాగర్ ఆర్ అదానీ, వినీత్ ఎస్ జైన్ లపై బ్రూక్లిన్లోని ఫెడరల్ కోర్టులో అభియోగాలు నమోదయ్యాయి. బీఎస్ఈ లో గురువారం అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ షేరు 20 శాతం లోయర్ సర్క్యూట్ రూ.697.70 ని తాకింది. అదానీ ఎంటర్ప్రైజెస్, అదానీ పోర్ట్స్ అండ్ స్పెషల్ ఎకనామిక్ జోన్ షేర్లు 23 శాతం చొప్పున నష్టపోయాయి. అంబుజా సిమెంట్స్ షేరు ధర 18 శాతం క్షీణించింది. అదానీ గ్రీన్ ఎనర్జీ షేర్లు 20 శాతం, అదానీ పవర్, అదానీ టోటల్ గ్యాస్ షేర్లు 18 శాతం చొప్పున క్షీణించాయి. అదానీ విల్మార్ షేరు ధర 10 శాతం పడిపోయింది. బీఎస్ఈలో ఉదయం ట్రేడింగ్ లో ఏసీసీ, ఎన్డీటీవీ వంటి ఇతర గ్రూప్ షేర్లు వరుసగా 15 శాతం, 14 శాతం నష్టపోయాయి. ఇదిలావుండగా, భారతదేశ అదానీ గ్రూప్ షేర్లలో పెద్ద వాటాదారు అయిన ఆస్ట్రేలియా-లిస్టెడ్ ఫండ్ మేనేజర్ జీక్యూజీ పార్ట్నర్స్ షేర్లు నవంబర్ 21, గురువారం 20% పడిపోయాయి.

### ఆ ఆరోపణలు నిరాధారం..న్యాయపరంగా ఎదుర్కొంటాం : అదానీ గ్రూప్




అవినీతి ఆరోపణలపై అదానీ గ్రూప్ స్పందించింది. సోలార్ పవర్ కాంట్రాక్టులు దక్కించుకోవడానికి లంచం ఇవ్వజూపారంటూ వచ్చిన అభియోగాలను తోసిపుచ్చింది. అదానీ గ్రూపుపై అమెరికా ప్రాసిక్యూటర్లు చేస్తున్న ఆరోపణలు నిరాధారమని కొట్టిపారేసింది. చట్టాలకు లోబడి తమ గ్రూపు నడుచుకుంటోందని వివరణ ఇచ్చింది. న్యాయపరంగా ముందుకెళ్లే అంశాన్ని పరిశీలిస్తున్నామని పేర్కొంది.

అమెరికా ప్రాసిక్యూటర్లు చేస్తున్న కేవలం నేరారోపణలు మాత్రమేనని అదానీ గ్రూపు ప్రతినిధి పేర్కొన్నారు. దోషులుగా రుజువయ్యే వరకు నిందితులను నిర్దోషులుగానే భావించాల్సి ఉంటుందన్నారు. పాలనా వ్యవహారాల్లో, పారదర్శకత విషయంలో అదానీ గ్రూపు ఎప్పుడూ అత్యున్నత ప్రమాణాలు పాటిస్తుందని తెలిపారు. తాము కార్యకలాపాలు నిర్వహించే ప్రతిచోట వీటిని పాటిస్తూ వస్తున్నామని చెప్పారు. చట్టాలను గౌరవిస్తూ, వాటికి లోబడి నడుచుకుంటున్నందున వాటాదారులు, భాగస్వాములు, ఉద్యోగులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు.

## కోటి దీపోత్సవంలో రాష్ట్రపతి ముర్ము



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గురువారం ఎన్టీఆర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన కోటి దీపోత్సవంలో పాల్గొన్నారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం గురువారం సాయంత్రం ఢిల్లీ నుంచి హైదరాబాద్ చేరుకుని ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహిస్తున్న కోటి దీపోత్సవానికి హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసిన ముర్ము తొలి కార్తీక దీపాన్ని వెలిగించారు. పూరీ జగన్నాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. యాదగిరి గుట్ట శీలక్ష్మీనరసింహస్వామికి పట్టువస్త్రాలు సమర్పించారు.

ఈ సందర్భంగా ముర్ము మాట్లాడుతూ పూరి జగన్నాథుడి కళ్యాణంలో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నాను.. తెలుగు నేలపై కార్తీక మాసం వేళ కోటి దీపోత్సవం వేడుకలో పాల్గొనడం సంతోషంగా ఉందని తెలిపారు. కార్తీక మాసంలో అందరూ శివుడిని కొలుస్తారు. అసత్యంపై సత్యం గెలిచిన పండుగ ఇది అని అన్నారు. అందరూ ఒక్కటై దీపాన్ని వెలిగించడం ఏకత్వాన్ని సూచిస్తుందన్నారు. దీపాలతో ప్రతీ కార్యక్రమాన్ని ప్రారంభించడం మన సంప్రదాయమని ఆమె అన్నారు. కోటి దీపోత్సవంలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉంది అని రాష్ట్రపతి అన్నారు. యాదాద్రి లక్ష్మీనరసింహ కళ్యాణం,పూరీ జగన్నాథుని కళ్యాణంలో పాల్గొనడం నా అదృష్టం అందరూ ఒక్కటై దీపాలు వెలిగించడం ఏకత్వాన్ని సూచిస్తుంది అని తెలిపారు. మన సాంస్కృతి ఇతర మతాలను గౌరవిస్తూనే సాంప్రదాయాలను ప్రతి ఒక్కరు కాపాడాలన్నారు.సమాజంలో చెడుపై మంచి విజయం సాధించలి అంటే ప్రతి ఒక్కరిలో జ్ఞాన దీపం వెలగాలన్నారు.అసత్యంపై సత్యం గెలిచిన పండగ ఇది కోటి దీపోత్సవంలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉంది తెలుగు నేలపై కార్తీక మాసం వేళ కోటి దీపోత్సవం చేయడం ఎంతో ఆనందం కలిగించింది అని తెలిపారు.

కోటి దీపోత్సవంలో రాష్ట్రపతి వెంట కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, మంత్రి సీతక్కలు కూడా హాజరయ్యారు. రాష్ట్రపతి ముర్ము శుక్రవారం లోక్ మంథన్ కార్యక్రమంలో పాల్గొంటారు. అంతర్జాతీయ జానపద కళారూపాల ఆవిష్కరణలో పాల్గొని శుక్రవారం మధ్యాహ్నం ఢిల్లీకి తిరిగి వస్తారని రాష్ట్రపతి వర్గాలు వెల్లడించాయి.

## నదులు కనుమరుగైతే మనిషి మనుగడే ప్రశ్నార్థకం

- సీఎం రేవంత్‌రెడ్డి

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో



నదులు కనుమరుగైతే మనిషి మనుగడే ప్రశ్నార్థకమవుతుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎక్స్ వేదికగా ఆందోళన వ్యక్తం చేశారు. "నదుల వెంట నాగరికత వర్ధిల్లాలి. నదులను కబళిస్తే మనిషి మనుగడే ప్రశ్నార్థకమవుతుంది. ప్రజారోగ్యం, పటిష్ట ఆర్థికం, పర్యావరణ కోణాల్లో ప్రపంచ స్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చెందాల్సిన హైదరాబాద్‌కు మూసీ ఒక వరం కావాలి. గానీ శాపంగా మిగిలిపోకూడదు. మూసీని ప్రక్షాళన చేయాలన్న ప్రజా ప్రభుత్వ సంకల్పం ఈ తరానికే కాదు తరతరాలకు మేలు చేసే నిర్ణయం. ఈ నిర్ణయానికి అండగా నిలిచే ప్రతి వ్యక్తికీ, ప్రతి వ్యవస్థకు ధన్యవాదాలు" అంటూ రేవంత్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

## అదానీతో అనుబంధం దేశానికే అవమానం

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో



అదానీతో కాంగ్రెస్, బీజేపీ అనుబంధం దేశానికి అవమానం, అరిష్టమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు అన్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. రామన్నపేటలో సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు కోసం ఎంత ఇవ్వజూపిండో, మూసీలో అదానీ వాటా ఎంతో అంటూ ప్రశ్నించారు. ఇలాంటి మోసగాడికి.. దగాకోరుకా.. తెలంగాణలో పెట్టుబడుల అనుమతులు ఎలా ఇచ్చారంటూ మండిపడ్డారు. తక్షణం అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ అనుమత ులను రద్దు చేయాలని.. అదానీతో చేసుకున్న చీకటి ఒప్పందాలు అన్నీ బయట పెట్టాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో ఆస్తులను కొల్లగొట్టే మీ కుయుక్తులలో మీ భడే భాయ్ వాటాఎంత ? మీ అదానీ భాయ్ వాటా ఎంత? మీ హైకమాండ్ వాటా ఎంత? అంటూ కేటీఆర్ సోషల్ మీడియా వేదికగా నిలదీశారు. గౌతమ్ అదానీ, ఆయన బంధువు సాగర్‌తో పాటు మరో ఏడుగురిపై అభియోగాలు నమోదయ్యాయి. అదానీ, అనుబంధ సంస్థలు 20 సంవత్సరాల్లో రెండు బిలియన్ డాలర్ల లాభం పొం సోలార్ పవర్ ప్లాంట్ ఒప్పందాలను పొందేందుకు భారత ప్రభుత్వ అధికారులకు 265 మిలియన్ డాలర్ల లంచాలు ఇవ్వజూపినట్లుగా ప్రాసిక్యూటర్లు ఆరోపించారు. అమెరికాతో పాటు ఇంటర్‌నేషనల్ ఇన్వెస్టర్లకు తప్పుడు సమాచారం ఇచ్చి నిధులను సమీకరించేందుకు కంపెనీ ప్రయత్నించారని అభియోగాలు మోపారు.

అదానీ గ్రీన్ ఎనర్జీలో అక్రమ మార్గాల ద్వారా కంపెనీ మూడు బిలియన్ డాలర్లకుపైగా రుణాలు, బాండ్లను సేకరించినట్లుగా న్యూయార్క్ ప్రాసిక్యూటర్లు పేర్కొన్నారు. ఈ క్రమంలోనే సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ మరో సివిల్ కేసు నమోదు చేసింది. యూఎస్ సెక్యూరిటీ చట్టాలను ఉల్లంఘించి అదానీ గ్రీన్ ఎనర్జీ అమెరికా ఇన్వెస్టర్ల నుంచి 175 మిలియన్ డాలర్లకుపైగా సేకరించినట్లుగా ఆరోపించింది. ఈ వ్యవహారంపై దర్యాప్తు జరిపి జరిమానాతో పాటు కంపెనీపై ఆంక్షలు విధించాలని రెగ్యులేటర్ కోరింది.

## జేఎల్ ఇంగ్లీష్, మ్యాథ్స్ అభ్యర్థుల తుది జాబితా విడుదల

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఖాళీగా ఉన్న 1392 పోస్టుల భర్తీకి టీజీపీఎస్సీ చర్యలు వేగవంతం చేసింది. ఇప్పటికే పలు పోస్టులకు సంబంధించిన అభ్యర్థుల తుది జాబితాను విడుదల చేయగా, తాజాగా ఇంగ్లీష్, మ్యాథ్స్ అభ్యర్థుల తుది జాబితాను టీజీపీఎస్సీ వెల్లడించింది. అభ్యర్థులు తుది జాబితా కోసం www.tspsc.gov.in అనే వెబ్‌సైట్‌ను లాగిన్ అవొచ్చు.

## రాష్ట్రంలో మహిళా సాధికారతకు పెద్దపీట



- సిద్ధమవుతున్న 22 మహిళా శక్తి భవనాలు
- శిల్పారామంలో 106 స్టాళ్ళతో ఇందిరా మహిళా శక్తి బజార్
- తొలివిడతలో 1000 మెగా వాట్ల సామర్థ్యం గల సోలార్ ప్లాంట్లు ఏర్పాటు
- మొదటి దశలో 150 బస్సుల కొనుగోలు

వివరాలు 2వ పేజీలో

## రాష్ట్ర వ్యాప్తంగా 29న దీక్షా దివస్..

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 29వ తేదీన అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో దీక్షాదివాస్ ఘనంగా నిర్వహించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. తెలంగాణ స్వరాష్ట్ర సాధనలో రాష్ట్ర ప్రజలకు ఇది అత్యంత కీలక ఘట్టంగా నిలుస్తుందని అన్నారు. 2009 నవంబర్ 29న కేసీఆర్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షతో మలిదశ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసి తెలంగాణ రాష్ట్ర సాధనకు బలమైన పునాదులు వేసిందన్నారు. ఈ దీక్ష యావత్ భారతదేశ రాజకీయ వ్యవస్థను కదిలించిందని, తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తున్నామని కేంద్ర ప్రభుత్వం స్వయంగా ప్రకటన చేసేలా చేసిందని పేర్కొన్నారు. దశాబ్దాల తెలంగాణ ప్రజలు చిరకాల ఆకాంక్షను నెరవేర్చిందని చెప్పారు. ఈ నెల 29న కరీంనగర్‌లో జరిగే దీక్షా దివస్‌లో కేటీఆర్ పాల్గొననున్నారు

## ప్రయాణికుల వాహనాలపై కాల్పులు..

- 38 మంది మృతి
- పాకిస్థాన్‌లో దారుణం

వివరాలు 3వ పేజీలో

## ఆస్పత్రిలోనూ విద్యార్థుల అల్పాహారంలో పురుగులు

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

నారాయణపేట మాగనూర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు భోజనం వికటించి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సంగతి తెలిసిందే. ఆ విద్యార్థులకు ఆస్పత్రిలో పెట్టిన అల్పాహారంలో పురుగులు రావడంతో తల్లితండ్రులు ఆందోళనకు గురయ్యారు. చికిత్స అందిస్తారని.. ఆస్పత్రికి వస్తే ప్రాణాలు పోయే పరిస్థితికి తీసుకువచ్చారంటూ ఆవేదన వ్యక్తంచేశారు. అస్వస్థతతో చికిత్స కోసం వస్తే నాణ్యమైన భోజనం అందించకుండా ఇక్కడా పురుగుల అన్నం పెట్టారని విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు వాపోయారు. అల్పాహారంలో పురుగులు ఉన్నాయని ముందుగా ఓ విద్యార్థి గమనించి విధుల్లోని సిబ్బందికి చెప్పగా మిగతా విద్యార్థులు తినకుండా జాగ్రత్తలు పడినట్టు పేర్కొన్నారు.

## బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు తెరలేపుతున్న సీఎం

- తప్పుడు ఆరోపణలు చేస్తున్న రేవంత్‌రెడ్డి
- రంగనాయకసాగర్ దగ్గరికి రా.. కలిసి భూమిని కొలుద్దాం
- మాజీ మంత్రి హరీష్‌రావు

వివరాలు 3వ పేజీలో

## లగచర్ల ఘటనపై సుమోటోగా కేసును స్వీకరించిన మానవ హక్కుల సంఘం

- సీఎస్, డీజీపీకి నోటీసులు
- రెండు వారాల్లోగా నివేదిక అందజేయాలని ఆదేశం

వివరాలు 2వ పేజీలో

# రాష్ట్రంలో మహిళా సాధికారతకు పెద్దపీట

- సిద్ధమవుతున్న 22 మహిళా శక్తి భవనాలు
- శిల్పారామంలో 106 స్టాళ్ళతో ఇందిరా మహిళా శక్తి బజార్
- తొలివిడతలో 1000 మెగా వాట్ల సామర్థ్యం గల సోలార్ ప్లాంట్లు ఏర్పాటు
- మొదటి దశలో 150 బస్సుల కొనుగోలు



**బలగం టీవీ , హైదరాబాద్**

రాష్ట్రంలో మహిళలను కోటీశ్వరులను చేయాలన్న ముఖ్యమంత్రి సంకల్పంలో భాగంగా మహిళా స్వయం సహాయక బృందాలచే బస్సుల కొనుగోలు, సోలార్ ప్లాంట్ ల ఏర్పాటు, శిల్పా రామంలో ఇందిరా మహిళా శక్తి బజార్ ల ఏర్పాటు పనులు ముమ్మరం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం అమలుపై గురువారం సచివాలయంలో ఉన్నతస్థాయి సమావేశంలో సమీక్షించారు.

ఈ సందర్భంగా సి.ఎస్ శాంతి కుమారి మాట్లాడుతూ, 22 ఇందిరా మహిళ శక్తి భవనాల నిర్మాణం పనులు మొదులుపెట్టి, 8 మాసాలలో పూర్తి చేయాలనీ ఆదేశించారు. రాష్ట్రంలోని స్వయం సహాయక మహిళల ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పించడానికై శిల్పారామంలో ఇందిరా మహిళా శక్తి బజార్ ను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. దాదాపు 106 షాప్ లతో ఏర్పాటు చేస్తున్న ఈ బాజార్ నిర్మాణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయని, డిసెంబర్ మొదటి వారంలోగా ఈ పనులు పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని పేర్కొన్నారు. ఈ ఇందిరా మహిళా శక్తి బజార్లో నిత్యం వివిధ సాంస్కృతిక సామాజిక కార్యక్రమాలు చేయటానకి మహిళలకు ఆర్థిక చేయూతకై నగరంలోని ఐ.టి సంస్థలు, ఇతర ప్రముఖ వాణిజ్య, వ్యాపార సంస్థలకు భాగస్వామ్యం కల్పించాలన్నారు.

రాష్ట్రంలో అద్భుతంగా పొదుపు సంఘాలను నిర్వహిస్తూ, అధిక మొత్తంలో డబ్బును పొదుపు చేసిన మహిళా సంఘాలచే బస్సులను కొనుగోలు చేయించి వాటిని టీ.ఎస్.ఆర్.టీ.సి ద్వారా నిర్వహించేందుకు తగు ప్రణాళిక రూపొందించాలని కోరారు. ఈ సంఘాల ద్వారా మొత్తం 600 బస్సులను కొనుగోలు చేయించాలని, దీనిలో భాగంగా మొదటి దశలో 150 బస్సుల కొనుగోలును వెంటనే చేపట్టనున్నట్టు స్పష్టం చేశారు. ఈ బస్సుల నిర్వహణ భాద్యతలను ఆర్టీసీ చేపడుతుందని అన్నారు.

వీటితో పాటు, మహిళా సంఘాల ద్వారా 4000 మేఘావాట్ల సామర్థ్యం గల సోలార్ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేయిం చాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, మొదటి దశలో 1000 మెగా వాట్ల సామర్థ్యం గల సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేయిస్తున్నామని వివరించారు. ఈ ప్లాంట్లను నీటిపారుదల శాఖ, దేవాదాయ, ఆటవీ శాఖలో నిరుపయోగంగా ఉన్న కాళీ భూములను లీజ్ పద్ధతిన సేకరించి ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడించారు. ఈ సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు మహిళా సంఘాలకు జీరో వడ్డీ రుణాలను కూడా అందిస్తున్నట్టు తెలిపారు. ఈ ప్లాంట్ల ఏర్పాటు అనంతరం వీటి నిర్వహణా బాధ్యతలను తెలంగాణ రెడ్కో, విధ్యుత్ డిస్కం లు చేపడుతాయని స్పష్టం చేశారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న ఈ ప్రాజెక్టుల ద్వారా స్వయం సహాయక మహిళా సంఘాల మహిళలకు పెద్ద మొత్తంలో ఆదాయం లభిస్తుందని సి.ఎస్ తెలిపారు.

రవాణా, రోడ్డు, భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, పీసీసీఎఫ్ ఆర్.యం.డోబ్రియల్, రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, ఎండోమెంట్స్ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, పర్యావరణ, అటవీ శాఖ కార్యదర్శి అహ్మద్ నదీమ్, నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, పంచాయత్ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి డి.ఎస్.లోకేష్ కుమార్, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి శరత్, సెర్ప్ సీఈవో దివ్య తదితరులు పాల్గొన్నారు.



## ప్రజాపాలనపై సంస్కృతిక సారాథుల కళా ప్రదర్శన

**బలగం టీవీ ,తంగళ్లపల్లి**

ప్రజా పాలన కళాయాత్ర లో భాగంగా చైతన్య రథం డీపీఆర్ ఓ ఆదేశాల మేరకు సంస్కృతిక సారధి కళాకారులు ఎడ్మల శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో తంగళ్లపల్లి లోని కళాజాతను ప్రదర్శించి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీలు మహాలక్ష్మి, ఇందిరా మహిళా శక్తి, గృహజ్యోతి,రైతు రుణమాఫీ, ఇందిరమ్మ ఇండ్లపై ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సంస్కృతిక కళాకారులు, కాంగ్రెస్ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## సీపీఐ(ఎం) రాజన్న సిరిసిల్ల జిల్లా కమిటీ సభ్యుడిగా రెండోసారి ఎన్నికైన గురుజాల శ్రీధర్



**బలగం టీవీ , బోయినిపల్లి**

ఈనెల 19, 20, తేదీలలో జరిగిన సీపీఐ(ఎం) రాజన్న సిరిసిల్ల జిల్లా మూడో మహాసభల సందర్భంలో జిల్లా పార్టీ నిర్ణయంలో భాగంగా సీపీఐ(ఎం) రాజన్న సిరిసిల్ల జిల్లా కమిటీ సభ్యులుగా గురుజాల శ్రీధర్ ను రెండోసారి ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గురజాల శ్రీధర్ మాట్లాడుతూ తనను రెండవసారి నియమించినందుకు రాష్ట్ర జిల్లా పార్టీ నాయకత్వానికి విప్లవ వందనాలు తెలియజేస్తూ, రాబోయే మూడేళ్ల కాలంలో బోయినిపల్లి మండలంలో పార్టీ క్యాడర్ ను బలోపేతం చేయడంతో పాటు, పేద ప్రజలు, సామాన్య ప్రజలు, అన్ని రంగాలలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వంతో పోరాటం చేయడంలో, ప్రభుత్వ దృష్టికి తీసుకురావడంలో పార్టీ అప్పజెప్పిన బాధ్యతను సంపూర్ణంగా నెరవేరుస్తూ కార్మిక వర్గానికి వెన్నుదన్నుగా ఉంటూ పార్టీ అభివృద్ధికి సంపూర్ణ న్యాయం చేస్తానని తెలిపారు. అలాగే ఈ జిల్లా మహాసభలకు మా మండలం నుండి హార్దిక సహకారాలు అందించినటువంటి వ్యాపారస్తులకు జిల్లా పార్టీ కమిటీ పక్షాన విప్లవ అభివందనాలు తెలియజేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎర్ర నాగరాజు, సింగిరెడ్డి శంకర్, కడుదుల రవి, అనుముల రవి, ఆవుల మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



## పర్వతనేని మాధవరావుకు నివాళులర్పించిన మంత్రి శ్రీధర్ బాబు..

**బలగం టీవీ ,గంభీరావుపేట**

పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు మామ పర్వతనేని మాధవరావు ఇటీవల మరణించగా గురువారం గంభీరావుపేట మండలం లింగన్నపేట గ్రామంలో నిర్వహించిన దశదినకర్మ కార్యక్రమానికి రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు, ప్రభుత్వ విప్ లు ఆది శ్రీనివాస్, లక్ష్మణ్ కుమార్ లు హాజరయ్యారు. మాధవరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## లగచర్ల ఘటనపై సుమోటోగా కేసును స్వీకరించిన మానవ హక్కుల సంఘం

- సీఎస్, డీజీపీకి నోటీసులు

**బలగం టీవీ, కొడంగల్**

కొడంగల్ లగచర్లలో కలెక్టర్, అధికారులపై రైతుల దాడి కేసులో బాధిత రైతుల ఫిర్యాదు మేరకు జాతీయ మానవ హక్కుల సంఘం ఈఘటనను సుమోటోగా స్వీకరించింది. తక్షణ విచారణ కోసం తమ అధికారుల బృందాన్ని ఘటనా స్థలానికి పంపాలని నిర్ణయించింది. అదేవిధంగా, రెండు వారాల్లోగా ఈ ఘటనపై సమగ్ర నివేదిక సమర్పించాలని తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, డీజీపీ జితేందర్‌లకు నోటీసులు జారీ చేసింది.

## 50వేల ఉద్యోగాలు ఇచ్చానని పచ్చి అబద్ధాలు ఆడుతున్న సీఎం



- సీఎంది అభివృద్ధి పర్యటన కాదు.. అబద్ధాల పర్యటన
- బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు.


**బలగం టీవీ, వేములవాడ**

50వేల ఉద్యోగాలు ఇచ్చానని పచ్చి అబద్ధాలు సీఎం ఆడుతున్నాడని,నోటిఫికేషన్ ఎప్పుడు ఇచ్చారు, ఇప్పుడు నియామకాలు చేపట్టారో చెప్పాలని బీఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇంచార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు అన్నారు. వేములవాడ పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇంచార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు మాట్లాడుతూ నాడు సోనియాగాంధీ బలిదేవత అన్న రేవంత్ రెడ్డి, ఇప్పుడు సోనియమ్మ తల్లి ఎలా అయింది... సీఎం చెప్పాలి అని అన్నారు.గోదావరి నీళ్ల తెచ్చి రాజన్న కాళ్ల కడిగింది,మధ్య మానేరు జలాశయాన్ని పూర్తి చేసింది కేసీఆర్ అని అన్నారు. కాంగ్రెస్ నిర్వాకంతో ఏండ్లకు ఏండ్లు పనులు పెండింగ్లో నిలిచిపోయాయని అన్నారు.

దేవుని మీద ఒట్టు వేసి రుణమాఫీ చేస్తా అని మాట ఇచ్చి మాట తప్పావని అన్నారు. పాపాలను కడుక్కోవడానికి సీఎం దేవాలయాల పర్యటనలు చేస్తున్నారని,కాలేశ్వరం మీద మాట్లాడే అర్హత ముఖ్యమంత్రికి లేదని అన్నారు. తమ ప్రభుత్వం హయాంలోనే కాళేశ్వరం నీళ్ల హైదరాబాద్ కు తరలించే ప్రణాళికలు సిద్ధం చేశారని,మల్లన్న సాగర్, కొండమ్మ పోచమ్మ సాగర్ కట్టింది కేసీఆర్ అని అన్నారు. కేసీఆర్ ముందుచూపుతో కట్టిన ప్రాజెక్టులతో ఇవాళ గోదావరి నీళ్ల హైదరాబాద్‌కు తరలిస్తానని అంటున్నావు,నీవు చేసింది ఏం లేదు, మందికి పుట్టిన బిడ్డ మా బిడ్డ అని ముద్దాడడం తప్ప మరొకటి లేదు అని అన్నారు.

# బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు తెరలేపుతున్న సీఎం

- తప్పుడు ఆరోపణలు చేస్తున్న రేవంత్‌రెడ్డి
- రంగనాయకసాగర్ దగ్గరికి రా.. కలిసి భూమిని కొలుద్దాం
- మాజీ మంత్రి హరీష్‌రావు



**బలగం టీవీ, హైదరాబాద్**

బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు సీఎం రేవంత్ రెడ్డి తెరలేపుతున్నాడని, కబ్జాల చరిత్ర ఆయనదేనని మాజీ మంత్రి హరీష్‌రావు ఆరోపించారు. గురువారం అందోల్ మండలం మాసాన్‌పల్లి గ్రామంలో పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రంగనాయక సాగర్ దగ్గర ఇరిగేషన్ భూములను కబ్జా చేశానని తనపై రేవంత్ రెడ్డి తప్పుడు ఆరోపణ చేశారని తెలిపారు. పచ్చకామెర్ల రోగికి లోకమంతా పచ్చగా కనిపిస్తుంది అన్నట్లు కబ్జాలు చేసే చరిత్ర నీదని ధ్వజమెత్తారు. రైతుల పట్టా భూములను ధరణి ద్వారా13 ఎకరాలు రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు వివరించారు. ఒక గుంట కానీ, ఒక ఎకరా కానీ ఇరిగేషన్ భూమి కానీ, ప్రభుత్వ భూమి కానీ తీసుకున్నట్టు నా చరిత్రలో లేదని స్పష్టం చేశారు. ఏ భూమిని అయితే నేను రిజిస్ట్రేషన్ చేసుకున్నానో ఆ భూమిలోనే ఉన్నానని, రంగనాయకసాగర్ దగ్గరికి రా.. కలిసి భూమిని కొలుద్దామని సవాల్ విసిరారు'నువ్వు ఎప్పుడు వస్తావో చెప్పు రేవంత్ రెడ్డి.. నీ సమక్షంలోనే సర్వే చేద్దాం. నువ్వు ఎన్ని బ్లాక్ మెయిల్ రాజకీయాలు చేసినా భయపడేది లేదన్నారు. బీఆర్ఎస్ పార్టీ తరపున రైతుల పక్షాన నిన్ను ప్రశ్నిస్తూనే ఉంటామన్నారు. వరంగల్ రైతు డిక్లరేషన్ సభలో రేవంత్ రెడ్డి రైతులకు తొమ్మిది హామీలను అమలు చేస్తామని ప్రకటించారు. ఇందులో ఏ ఒక్క హామీనైనా నెరవేర్చగలిగాడా?' అని ప్రశ్నించారు.

# మహబూబాబాద్‌లో 144 సెక్షన్..

- బీఆర్ఎస్ మహాధర్నాకు పోలీసుల అనుమతి నిరాకరణ..
- కేటీఆర్ పర్యటన వాయిదా

**బలగం టీవీ, మహబూబాబాద్**

మహబూబాబాద్ పట్టణంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాకు పోలీసులు అనుమతి నిరాకరించారు. దాంతో బీఆర్ఎస్ కూడా ధర్నాను వాయిదా వేసింది. ఈ నేపథ్యంలో మహబూబాబాద్‌లో కేటీఆర్ పర్యటన వాయిదా పడింది. అలాగే మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా ఈరోజు పోలీసులు 144 సెక్షన్ విధించినట్లు ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ తెలిపారు. బీఆర్ఎస్ మహాధర్నాకు పోలీసుల అనుమతి నిరాకరణ ముందస్తు చర్యల్లో భాగంగా జిల్లా కేంద్రంలో భారీగా పోలీస్ భద్రత ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. మహబూబాబాద్ గల్లీ గల్లీలో సెక్షన్ 144 అమలు అవుతోందని మైక్ సెట్ ద్వారా పోలీసుల ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు.

గిరిజన, దళిత, పేద రైతులపై దాడికి నిరసనగా మహబూబాబాద్‌లో బీఆర్ఎస్ నాయకులు ధర్నాకు పిలుపునిచ్చారు. మరోవైపు బీఆర్ఎస్ ధర్నాకు పోలీసులు అనుమతి నిరాకరించారు. దీంతో బుధవారం రాత్రి మహబూబాబాద్ ఎస్పీ క్యాంపు కార్యాలయం ఎదుట బీఆర్ ఎస్ నాయకులు రైతుల మహాధర్నాకు అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ధర్నాకు దిగారు. అయితే పోలీసులు అనుమతి ఇవ్వలేదు. ఈ రైతు మహా ధర్నాకు కేటీఆర్ కూడా హాజరు కావాల్సి ఉండగా, పోలీసులు అనుమతి ఇవ్వకపోవడంతో యాత్రను రద్దు చేసుకున్నారు.

## బీఆర్ఎస్ ధర్నాకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్

**బలగం టీవీ, హైదరాబాద్**

గిరిజనులు, దళితులపై జరిగిన దాడికి నిరసనగా మహబూబాబాద్‌లో బీఆర్ఎస్ తలపెట్టిన గిరిజన రైతు ధర్నాకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈనెల 25న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు అనుమతిస్తూ.. ధర్నాలో వెయ్యి మంది మాత్రమే పాల్గొనాలని షరతు విధించింది. అయితే, మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో గిరిజన రైతు ధర్నా గురువారం చేపట్టాలని బీఆర్ఎస్ పార్టీ నిర్ణయించింది. కానీ పోలీసులు అనుమతించకపోవడంతో బీఆర్ఎస్ హైకోర్టును ఆశ్రయించింది. తాజాగా ధర్నాకు అనుమతినిస్తూ హైకోర్టు పచ్చజెండా ఊపింది.

# అదానికో న్యాయం.. ఆడబిడ్డకో న్యాయమా..?

**బలగం టీవీ, హైదరాబాద్**

జైలు నుంచి విడుదలైన తర్వాత ఎమ్మెల్సీ కవిత తొలిసారి రాజకీయ వ్యాఖ్యలు చేశారు. అదానీ వ్యవహారంపై ఆమె సంచలన ట్వీట్ చేశారు. బీజేపీ, ప్రధాని మోడీపై కవిత తీవ్ర ఆరోపణలు చేశారు. ఎన్ని సార్లు ఎన్ని ఆరోపణలు వచ్చినా ప్రధాని అదానీ వైపేనా..? అని కవిత ప్రశ్నించారు. అఖండ భారతంలో అదానికో న్యాయం.. ఆడబిడ్డకో న్యాయమా అని నిలదీశారు. ఆధారాలు లేకున్నా ఆడబిడ్డను కాబట్టి అరెస్ట్ చేయడం ఈజీ. ఆధారాలు ఉన్నా అదానీని అరెస్ట్ చేయడం మాత్రం కష్టమా అని కవిత ప్రధానిని ప్రశ్నించారు.





# ప్రయాణికుల వాహనాలపై కాల్పులు..

- 38 మంది మృతి

**బలగం టీవీ, ఇస్లామాబాద్**

పాకిస్థాన్‌లో పయాణికుల వాహనాలపై దుండుగులు దాడి చేశారు. ఈ సంఘటనలో 38 మంది మరణించారు. మరో 29 మంది గాయపడ్డారు. పాకిస్థాన్‌లోని ఖైబర్ పఖ్తున్‌ఖ్వా ప్రావిన్స్‌లో ఈ సంఘటన జరిగింది. గురువారం గిరిజన కుర్రం జిల్లాలోని పరాచినార్‌లో సాయుధులైన వ్యక్తులు ... పెషావర్ నుంచి పరాచినార్‌కు, పరాచినార్ నుంచి పెషావర్‌కు ప్రయాణీకులతో వెళ్తున్న రెండు వ్యాన్లపై విచక్షణ రహితంగా కాల్పులు జరిపారు. ఆ రెండు వాహనాల్లో ప్రయాణిస్తున్న వారిలో 38 మంది మరణించారు. మరో 29 మంది గాయపడ్డారు. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతుల్లో మహిళలు, పిల్లలు ఉన్నారు. కాగా, ఖైబర్ పఖ్తున్‌ఖ్వా ప్రావిన్స్ చీఫ్ సెక్రటరీ నదీమ్ అస్లాం చౌదరి ఈ దాడిని ధృవీకరించారు. ఇది పెద్ద విషాదమని, మరణాల సంఖ్య పెరిగే అవకాశం ఉందని తెలిపారు. పాకిస్థాన్ అధ్యక్షుడు అసిఫ్ అలీ జర్దారీ కూడా ఈ దాడిని ఖండించారు. మరోవైపు ఆఫ్ఘనిస్థాన్ సరిహద్దులో ఉన్న ఈ గిరిజన ప్రాంతంలో భూ వివాదంపై సాయుధ షియా, సున్నీ ముస్లింల మధ్య దశాబ్దాలుగా దాడులు, ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. అయితే ఈ దాడికి ఏ గ్రూపు బాధ్యత వహించలేదని అధికారులు తెలిపారు.

# ఏసీబీ వలలో సీనియర్ డ్రాఫ్ట్‌మెన్



**బలగం టీవీ, మహబూబాబాద్**

సీనియర్ డ్రాఫ్ట్‌మెన్ ఏసీబీకి పట్టుబడిన ఘటన గురువారం చోటుచేసుకున్నది. ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా శివనగర్‌కు చెందిన యువకుడు తాళ్ల కార్తీక్ మహబూబాబాద్ పట్టణ శివారు లోని ప్రాంతంలో మూడు ఎకరాల వ్యవసాయ భూమిని కొనుగోలు చేసేందుకు సిద్ధమ య్యాడు. ఈ భూమి సర్వే నంబర్లు, వివాదాలకు సంబంధించిన వివరాల కోసం నక్షకు కలెక్టరే ట్‌లోని సర్వే, భూమి రికార్డుల విభాగంలో గత నెల 28న దరఖాస్తు చేశాడు. దీనికి సంబంధించి సీనియర్ డ్రాఫ్ట్‌మెన్ జ్యోతీక్షేమాబాయి రూ. 5 వేలతో చలానా తీయాలని చెప్పింది. ఈ క్రమంలో కార్తీక్ ఆమెకు రూ. ఐదు వేలు ఇచ్చాడు. మళ్లీ రెండు రోజుల తరువాత నక్ష మ్యాప్ కోసం బాధితుడు రాగా రూ.20 వేలు ఇస్తేనే మ్యాప్ వస్తుందని జ్యోతీక్షేమాబాయి చెప్పింది. కార్తీక్‌కు లంచం ఇవ్వడం ఇష్టం లేక వరంగల్ ఏసీబీ అధికార ులను సంప్రదించాడు. ఈ క్రమంలో గురువారం ఉదయం అతడు జ్యోతీక్షేవ ాబాయికి రూ. 20 వేలు లంచం ఇస్తుండగా రెడ్ హ్యాండెడ్‌గా ఏసీబీ అధికారులు పట్టుకు న్నారు. ఎవరైనా అధికారులు లంచం అడిగితే వెంటనే 1064 నంబరుకు గానీ, ఏసీబీ అధికారులను గానీ సంప్రదించాలని అధికారులు పేర్కొన్నారు.

# ఖండాంతర క్షిపణిని ప్రయోగించిన రష్యా


**బలగం టీవీ, కీవ్**

ఉక్రెయిన్‌పై ఉదయం చేసిన దాడిలో రష్యా తన దక్షిణ ఆస్ట్రాఖాన్ ప్రాంతం నుండి ఖండాంతర క్షిపణిని ప్రయోగించిందని కీవ్ వైమానిక దళం తెలిపింది. యుద్ధం మొదలైన తర్వాత రష్యా ఇంత సుదూర, శక్తివంతమైన క్షిపణిని ఉపయోగించడం ఇదే తొలిసారి అని ఉక్రెయిన్ పేర్కొంది. జో బైడెన్ అడ్మినిస్ట్రేషన్ ఉక్రెయిన్‌కు యాంటీ పర్సనల్ ల్యాండ్ మైన్‌ల ఏర్పాటును ఆమోదించిన తర్వాత, వ్లోదిమీర్ జెలెన్స్కీ ఒక వీడియోలో యుఎస్‌కి కృతజ్ఞతలు తెలిపారు, ల్యాండ్‌మైన్‌లు “రష్యన్ దాడులను ఆపడానికి అత్యవసరం” అని ‘ది గార్డియన్’ నివేదించింది. అంతకుముందు, యుఎస్ డిఫెన్స్ సెక్రటరీ లాయిడ్ ఆస్టిన్ మాట్లాడుతూ, మారుతున్న రష్యా వ్యూహాలను ఎదుర్కోవడానికి ఉక్రెయిన్ కోసం యాంటీ పర్సనల్ ల్యాండ్‌మైన్‌లపై వాషింగ్టన్ విధానంలో మార్పు అవసరమని అన్నారు.



# నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

- 422 పాయింట్లు కోల్పోయిన సెన్సెక్స్
- 168 పాయింట్లు నష్టపోయిన నిఫ్టీ




**బలగం టీవీ, ముంబై**

దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం మళ్లీ నష్టాలను మూటకట్టుకున్నాయి. అదానీపై అమెరికాలో కేసులు, అంతర్జాతీయ ప్రతికూలతలతో మన మార్కెట్లు నష్టపోయాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 422 పాయింట్లు నష్టపోయి 77,155కి పడిపోయింది. నిఫ్టీ 168 పాయింట్లు కోల్పోయి 23,349కి దిగజారింది. బీఎస్ఈ సెన్సెక్స్ టాప్ గెయినర్స్: పవర్ గ్రిడ్ కార్పొరేషన్ (3.41%), అల్ట్రాటెక్ సిమెంట్ (1.41%), హెచ్సీఎల్ టెక్నాలజీస్ (0.87%), టాటా స్టీల్ (0.57%), టీసీఎస్ (0.49%). కాగా టాప్ లూజర్స్: అదానీ పోర్ట్స్ (-13.53%), ఎన్టీపీసీ (-2.73%), స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (-2.64%), ఐటీసీ (-2.18%), ఏషియన్ పెయింట్స్ (-2.17%).

# మోస్ట్ పాపులర్ నటీనటుల జాబితాలో ప్రభాస్, సమంత





**బలగం టీవీ, హైదరాబాద్**

ప్రముఖ మీడియా సంస్థ ఆర్మాక్స్ విడుదల చేసిన మోస్ట్ పాపులర్ నటీనటుల జాబితాలో టాలీవుడ్ స్టార్లు ప్రభాస్, సమంత టాప్‌లో నిలిచారు. గత నెలలో(అక్టోబర్) అత్యంత ప్రేక్షకాదరణ పొందిన హీరోయిన్ల లిస్ట్?లో సమంత పేరు మొదటి స్థానంలో ఉండగా, హీరోల జాబితాలో ప్రభాస్ పేరు ఫస్ట్ పొజిషన్‌ను కైవసం చేసుకుంది. ఆ తర్వాత రెండులో కోలీవుడ్ హీరో విజయ్, మూడులో షారుక్ ఖాన్ పేర్లు ఉన్నాయి. ఇక ఎన్టీఆర్ నాలుగో స్థానంలో ఉండగా, 6,7 స్థానాల్లో అల్లు అర్జున్, మహేశ్‌బాబు ఉన్నారు. 9వ స్థానంలో రామ్‌చరణ్ ఉన్నారు.


ఇదిలా ఉండగా, మోస్ట్ పాపులర్ హీరోయిన్ల జాబితాలో గత నెలలో టాప్‌లో ఉన్న సామ్ ఈ సారి కూడా ఫస్ట్ ప్లేస్‌లోనే కంటిన్యూ అయ్యింది. దీంతో వరుసగా రెండు నెలల పాటు ఈ టాప్ స్టార్స్ లిస్ట్‌లో టాప్ వన్‌లో ఉన్న సెలబ్రిటీగా రికార్డుకెక్కింది. ఆ తర్వాతి స్థానంలో 'జిగ్రా' ఇటీవలె అభిమానులను పలకరించిన ఆలియా భట్ సొంతం చేసుకుంది. ఇక టాప్3లో కోలీవుడ్ లేడీ సూపర్ స్టార్ నయనతార నిలిచింది.


**ఆర్మాక్స్‌లో టాప్ టెన్‌లో నిలిచిన హీరోలు ఎవరంటే :**

1. ప్రభాస్
2. విజయ్
3. షారుక్ ఖాన్
4. ఎన్టీఆర్
5. అజిత్ కుమార్
6. అల్లు అర్జున్
7. మహేశ్ బాబు
8. సూర్య
9. రామ్‌చరణ్
10. సల్మాన్ ఖాన్

**ఆర్మాక్స్‌లో టాప్ టెన్‌లో నిలిచిన హీరోయిన్‌లు**

1. సమంత
2. అలియా భట్
3. నయనతార
4. దీపికా పదుకొణె
5. త్రిష
6. కాజల్ అగర్వాల్
7. శ్రద్ధా కపూర్
8. సాయి పల్లవి
9. రష్మిక
10. కత్రినా కైఫ్







## 'సంక్రాంతికి వస్తున్నాం'.. పండుగ రోజునే వస్తున్నాం

వెంకటేశ్ హీరోగా దర్శకుడు అనిల్ రావిపూడి తెరకెక్కిస్తున్న చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం'. టైటిల్‌కు తగ్గట్టే సినిమా వచ్చే ఏడాది సంక్రాంతికి బాక్సాఫీసు ముందుకు తీసుకొస్తున్నట్టు చిత్ర బృందం ప్రకటించింది. ఈ మేరకు హైదరాబాద్‌లో ప్రెస్‌మీట్ నిర్వహించింది. 2025 జనవరి 14న సినిమాని విడుదల చేయనున్నట్టు తెలిసింది. ఐశ్వర్యా రాజేశ్, మీనాక్షీ చౌదరి హీరోయిన్లు. వినూత్నమైన ముక్కోణపు క్రైమ్ కథాంశంతో ఈ సినిమా రూపొందుతోంది. చిత్రీకరణ ముగింపు దశలో ఉంది. ఈ చిత్రాన్ని శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్‌రాజు సమర్పణలో శిరీష్ నిర్మిస్తున్నారు.

బుధవారం నిర్వహించిన రిలీజ్ డేట్ అనౌన్స్‌మెంట్ సమావేశంలో వెంకటేష్ మాట్లాడుతూ 'టైటిల్‌లో చెప్పినట్లుగా నిజంగానే సంక్రాంతికి వస్తున్నాం. యూత్, ఫ్యామిలీస్ అందరికి ఈ సినిమా నచ్చుతుంది. నా కెరీర్‌లో బెస్ట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఇది. సంక్రాంతికి చక్కటి వినోదాన్ని పంచుతుంది' అన్నారు. ఈ సినిమా రషెష్ చూసి నాన్‌స్టాప్‌గా నవ్వుకున్నామని, సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు సినిమా నుంచి తమ సంస్థతో వెంకటేష్‌గారి అనుబంధం కొనసాగుతున్నదని, ఆ సినిమా తరహాలోనే పెద్ద విజయం సాధిస్తుందనే నమ్మకం ఉందని దిల్‌రాజు పేర్కొన్నారు. దర్శకుడు అనిల్ రావిపూడి మాట్లాడుతూ 'క్రైమ్ నేపథ్యంలో నడిచే ఫన్ ఎంటర్‌టైనర్ ఇది. ప్రేక్షకులు థ్రిల్‌కు గురవుతారు. వెంకటేష్‌గారితో హ్యాట్రిక్ హిట్‌గా నిలుస్తుందనే నమ్మకం ఉంది. కథానాయికలు ఐశ్వర్యరాజేష్, మీనాక్షి చౌదరి పాత్రలు గుర్తుండిపోతాయి' అని చెప్పారు. పోలీస్ పాత్ర చేయాలని ఎప్పటి నుంచో అనుకుంటున్నానని, ఈ సినిమాతో ఆ కల తీరిందని మీనాక్షి చౌదరి పేర్కొంది. ఉపేంద్ర లిమాయే, రాజేంద్రప్రసాద్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సమీర్ రెడ్డి, సంగీతం: భీమ్స్ సిసిరోలియో, రచన-దర్శకత్వం: అనిల్ రావిపూడి.

# ఎవరని మీడియం పేసర్ అంటున్నావ్?

## 150 స్పీడ్‌తో బౌలింగ్ చేస్తా




● **ప్రెస్‌మీట్‌లో బుమ్రా**

**బలగం టీవీ, పెర్త్**

ఆస్ట్రేలియాతో ఐదు టెస్ట్‌ల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీకి అన్నివిధాల సిద్ధమయ్యామని టీమిండియా తాత్కలిక టెస్ట్ కెప్టెన్ జస్‌ప్రీత్ బుమ్రా అన్నాడు. శుక్రవారం నుంచి పెర్త్ వేదికగా జరిగే తొలి టెస్ట్‌తో ఈ సిరీస్‌కు తెరలేవనుంది. తొలి టెస్టులో టీమ్‌ఇండియాను స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా జట్టును నడిపించనున్నాడు. ఈ నేపథ్యంలో తొలి టెస్టుకు ముందు ఆస్ట్రేలియాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బుమ్రా మాట్లాడుతూ రిపోర్టర్లు అడిగిన ప్రశ్నలకు సరదాగా సమాధానాలు ఇచ్చి ఆకట్టుకున్నాడు. తనను మీడియం పేసర్ అని పిలిచిన రిపోర్టర్‌కు ఫన్నీ కౌంటర్ ఇచ్చాడు.

ఓ రిపోర్టర్ బుమ్రాను 'మీడియం పేస్ ఆల్ రౌండర్' అని సంబోధించాడు. దాంతో బుమ్రా వెంటనే తాను గంటకు 150 కిలోమీటర్ల వేగంతో బౌలింగ్ చేస్తానని చెప్పాడు. అలాగే మరో రిపోర్టర్ అడిగిన ప్రశ్నకు బుమ్రా సమయస్ఫూర్తిగా, ఫన్నీగా ఆన్సర్ ఇచ్చాడు.

**రిపోర్టర్ ప్రశ్న :** ఓ మీడియం పేస్ ఆల్ రౌండర్‌గా భారత జట్టుకు సారథ్యం వహించడం ఎలా ఉంది?

**బుమ్రా :** యార్ నేను గంటకు 150 కిలోమీటర్ల వేగంతో బౌలింగ్ చేయగలను. కనీసం నువ్వు ఫాస్ట్ బౌలర్ కెప్టెన్ అని పిలువు. పేసర్లకు కెప్టెన్సీ ఇవ్వడాన్ని నేను ఎప్పు డూ సమర్థిస్తాను. ఎందుకంటే వారు వ్యూహాత్మకంగా ఆలోచిస్తారు. పాట్ కమిన్స్ ఆసీస్‌ను అద్భుతంగా నడిపిస్తున్నాడు. కపిల్ దేవ్ సహా చాలా మంది జట్టును విజయపథంలో నడిపించిన సందర్భాలు ఉన్నాయి.

అలాగే బోర్డర్- గావస్కర్ ట్రోఫీ కోసం టీమ్‌ఇండియా అన్ని విధాల సిద్ధమైందని బుమ్రా వ్యాఖ్యానించాడు. జట్టులోని చాలా మంది కుర్రాళ్లు తొలిసారి ఆసీస్ పర్యటనకు వచ్చారని పేర్కొన్నాడు. కానీ తాము తొలిసారి ఆసీస్ పర్యటనకు వచ్చినప్పుడు ప్రస్తుత సమయం కంటే చాలా తక్కువ సమయం లభించిందని కానీ సిరీస్ గెలిచామని గుర్తు చేసుకున్నాడు.

"మేం ఎప్పుడూ మాపై నమ్మకం ఉంచడంతో పాటు ఆత్మవిశ్వాసంతో ఉంటాం. ఎక్కడ ఆడినా.. ఎలాంటి పరిస్థితుల్లోనైనా ఒకేలా ఉంటాం. సన్నాహకాల విషయానికి వస్తే మేం మెరుగైన స్థితిలోనే ఉన్నాం. ఈ సిరీస్‌లో రాణించడం అనేది మా మానసిక స్థితిపైనే ఆధారపడి ఉంటుంది. మేం మెరుగైన ప్రదర్శన చేస్తామని ఆశిస్తున్నా" అని అన్నాడు.

## సంజయ్ మంజ్రేకర్ వ్యాఖ్యలకు షమీ కౌంటర్



**బలగం టీవీ, హైదరాబాద్**

టీమిండియా మాజీ క్రికెటర్, ప్రముఖ కామెంటేటర్ సంజయ్ మంజ్రేకర్ ఇటీవలస్టార్ పేసర్ మహమ్మద్ షమీపై చేసిన వ్యాఖ్యలకు షమీ కౌంటర్ ఇచ్చాడు. అతి తెలివిని దాచుకోవాలని .. సంజయ్ మంజ్రేకర్ బాబాజీ అవతారమెత్తాడని, జాతకాలు కావాలంటే అతన్ని కలవాలని జనాలకు తెలియజేస్తూ ఇన్‌స్టాగ్రామ్ వేదికగా సెటైర్లు వేశాడు.

ఐపీఎల్ 2025 మెగా వేలంలో మహమ్మద్ షమీ తక్కువ ధర పలుకుతాడని ఇటీవల సంజయ్ మంజ్రేకర్ జోస్యం చెప్పాడు. గాయంతో ఏడాది పాటు జట్టుకు దూరమైన షమీని తీసుకునేందుకు ఫ్రాంచైజీలు ఆసక్తి కనబర్చినా..ఎక్కువ ధర పెట్టకపోవచ్చన్నాడు. ఒకవేళ భారీ ధరతో కొనుగోలు చేస్తే తీవ్రంగా నష్టపోతారని తెలిపాడు. సీజన్ మధ్యలోనే షమీ దూరమైతే సదరు ఫ్రాంచైజీకి కష్టాలు తప్పవన్నాడు.

ఈ వ్యాఖ్యలకు .. సోషల్ మీడియా వేదికగా షమీ ఘాటుగా స్పందించాడు.'బాబాకీ జై.. నీ అతి తెలివిని కాస్త దాచుకో సంజయ్. ఎవరికైనా జాతకం కావాలంటే సంజయ్ మంజ్రేకర్‌ను కలవండి'అని షమీ రాసుకొచ్చాడు. గాయం నుంచి పూర్తిగా కోలుకున్న షమీ.. రంజీట్రోఫీలో బెంగాల్ తరపున బరిలోకి దిగి సత్తా చాటాడు. ఆస్ట్రేలియాతో బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ ఆడేందుకు సమాయాత్తమవుతున్నాడు. ఇక సౌదీ అరేబియాలోని జడ్డా వేదికగా ఆది, సోమ(నవంబర్ 24, 25) తేదీల్లో ఐపీఎల్ 2025 మెగా వేలం జరగనుంది. ఈ సారి మెగా వేలంలో 10 ఫ్రాంచైజీల్లోని 204 స్థానాల కోసం 574 మంది పోటీ పడుతున్నారు. ఇందులో 366 మంది భారత ఆటగాళ్లు ఉండగా.. 208 మంది ఓవర్‌సీస్ ప్లేయర్లు ఉన్నారు.మరో ముగ్గురు అసోసియేట్ నేషన్స్‌కు చెందిన ఆటగాళ్లు ఉన్నారు. భారత్‌కు చెందిన 318 మంది అనామక ఆటగాళ్లు ఈ జాబితాలో చోటు దక్కించుకోగా.. 12 మంది అన్‌క్యాప్డ్ ఓవర్‌సీస్ ప్లేయర్లు ఉన్నారు. 70 ఓవర్‌సీస్ స్లాట్స్ అందుబాటులో ఉన్నాయి. రెండు రోజుల పాటు జరిగే ఈ మెగా వేలం మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభం కానుంది. గత సీజన్ వరకు గుజరాత్ టైటాన్స్‌కు ప్రాతినిథ్యం వహించిన షమీని ఆ జట్టు వేలంలోకి వదిలేసింది.

# హైదరాబాద్‌లో ఫిష్ ఫుడ్ ఫెస్టివల్



**బలగం టీవీ, హైదరాబాద్**

ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో సచివాలయం సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం గ్రౌండ్‌లో ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ మొదలైంది. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ఫెస్టివల్‌ను ప్రారంభించారు. ఒగ్గుడోలు, డప్పు కళాకారులు, పిల్లలు తమ కళాప్రదర్శలతో హడావిడి చేశారు. మత్స్యకారుల సామాజిక తరగతి నుంచి తొలి ప్రొఫెసర్‌గా ఉన్న సుదర్శన్‌రావును, మత్స్యకార్మిక రంగం అభివృద్ధికి కృషి చేస్తున్న వారికి జ్ఞాపికలను అందజేశారు. ఇందులో ఆలిండియా ఫిషర్మెన్ కాంగ్రెస్ జాతీయ చైర్మెన్ ఆర్మ్‌స్ట్రాంగ్ ఫెర్నాండో, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే దానం నాగేందర్, కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు, టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ పటేల్ రమేశ్‌రెడ్డి, సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ అన్వేశ్‌రెడ్డి, తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ చైర్మెన్ నిర్మల జగ్గారెడ్డి, ఎస్టీ కార్పొరేషన్ చైర్మెన్ బెల్లయ్య నాయక్, ఎస్సీ కార్పొరేషన్ చైర్మెన్ ప్రీతమ్, ఎంబీసీ కార్పొరేషన్ చైర్మెన్ జె.జైపాల్, వికలాంగుల కార్పొరేషన్ చైర్మెన్ ముత్తినేని వీరయ్య, తదితరులు పాల్గొన్నారు. ఫెస్టివల్ ప్రారంభ సభలో స్పీకర్ ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ..మత్స్యకార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. తెలంగాణలో మత్స్యకారుల కోసం ప్రజాప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. ప్రతి ఇంటికీ ప్రజా ప్రభుత్వం విజయాలను తీసుకెళ్లాలని కోరారు. ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ..మత్స్యకారుల సామాజిక తరగతికి సీఎం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారనీ, రాష్ట్రంలో ప్రకటించిన తొలి కార్పొరేషన్ చైర్మెన్ మెట్టు సాయికుమార్ అని గుర్తుచేశారు. ఎమ్మెల్యే దానం నాగేందర్ మాట్లాడుతూ..బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి ప్రజాప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు.

# సచివాలయంలో 'ఫేషియల్' అటెండెన్స్



**బలగం టీవీ, హైదరాబాద్**

సచివాలయ ఉద్యోగులకు నేటి నుంచి నూతన హాజరు వ్యవస్థ అమల్లోకి రానున్నది. ప్రభుత్వ ఉద్యోగులతోపాటు కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఫేషియల్ రికగ్నిజేషన్ అటెండెన్స్ విధానం అమలుచేస్తామని సీఎస్ ఇటీవల ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ మేరకు శుక్రవారం నుంచి రిజిస్ట్రేషన్ ప్రారంభం కానున్నది. అయితే ఈ విధానంపై ఉద్యోగులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కనీసం ఉద్యోగులతోనో, ఉద్యోగ సంఘాల ప్రతినిధులతోనో ఎందుకు సంప్రదించలేదని ప్రశ్నిస్తున్నారు. ఈ హాజరు విధానంతో తమకు ఎదురయ్యే సమస్యలను ఎలా పరిష్కరిస్తారో చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు.

# మంచిర్యాలలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి శంకుస్థాపన

- **రూ.360కోట్లతో నిర్మించనున్న 650 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి**

**బలగం టీవీ, హైదరాబాద్**

పేదలకు మండల కేంద్రాల్లోనే 90శాతం అన్నిరకాల వైద్యసేవలందేలా ఏర్పాట్లు చేస్తామని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ చెప్పారు. పేదలకు అవసరమైన విద్య, వైద్యం ఉచితంగా అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రధాన లక్ష్యమని తెలిపారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఐబి చౌరస్తాలో రూ.360కోట్లతో నిర్మించనున్న 650 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి గురువారం మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావుతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం బహిరంగ సభలో మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ.. చుట్టు పక్కల మూడు రాష్ట్రాలు, స్థానికంగా ఏడు నియోజకవర్గాల ప్రజలకు ఉపయోగపడేలా మంచిర్యాలలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మిస్తామని చెప్పారు.తెలంగాణలో మొత్తం 54 ట్రామా సెంటర్‌లు మంజూరు చేస్తామని, గ్రామీణ ప్రాంతాలకు అంబులెన్సు సౌకర్యాలు కల్పిస్తామని అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను విస్తరించి బెడ్ల సంఖ్యను పెంచుతామన్నారు. 6 బెడ్స్‌తో ఉన్న జన్నారం పీహెచ్‌సీని 30బెడ్స్‌కు విస్తరిస్తామని చెప్పారు. జిల్లాలో వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, ఆశా కార్యకర్తల కొరత లేకుండా చూస్తామన్నారు. జిల్లాలో క్యాన్సర్, ట్రామా, వాస్క్యులర్ సేవలు అందించేలా ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు.

సింగరేణిలో రెగ్యులర్ కార్మికులతోపాటు కాంట్రాక్టు ఉద్యోగులకు కూడా లాభాల్లో బోనస్ అందించామని, బొగ్గు గనులను కాపాడటం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తోందని చెప్పారు. ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. సమస్యలకు పరిష్కారం చూపే దిశగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు ఆదరి స్తున్నారని అన్నారు. అందులో భాగంగానే జిల్లాలో 650 పడకల సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్టు తెలిపారు. సామాన్య ప్రజలు కూడా పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు



జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు కొనసాగుతున్నాయన్నారు. మందుల కొరత లేకుండా డ్రగ్ స్టోరేజీ సెంటర్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేసు కుంటూ ప్రజల సహకారంతో ముందుగు సాగు తున్నట్టు చెప్పారు.ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు మాట్లాడుతూ.. త్వరలోనే జిల్లాలో ఐటీ హబ్, ఇండస్ట్రియల్ పార్క్‌కు శంకుస్థాపన చేస్తామన్నారు. ఇచ్చిన హామీ ప్రకారం సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మిస్తున్నామని,ఇకపై పేద ప్రజలు వైద్యం కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదని అన్నారు. పార్టీ అధికారంలో ఉన్నా లేకున్నా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు మంత్రి శ్రీధర్‌బాబు వెన్ను దన్నుగా నిలిచారని తెలిపారు.

రాబోయే రోజుల్లోనూ మంత్రి సహకారం జిల్లాకు ఉండాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన కో-ఆపరేటివ్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ చైర్మెన్ కొట్నాక తిరుపతి, మినిమమ్ వేజెస్ బోర్డు చైర్మెన్ జనక్ ప్రసాద్, మున్సిపల్ చైర్మెన్ రావుల ఉప్పలయ్య, వైస్ చైర్మెన్ సల్ల మహేష్, నస్పూర్ మున్సిపల్ చైర్మెన్ సురిమల్ల వేణు, టిజిఎంఎస్ఐడిసి ఎండి హేమంత్ బోర్కడే, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, జిల్లా వైద్య శాఖ అధికారి డా.హరీష్‌రాజ్, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డా.సులేమాన్, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ హరీష్‌చంద్రారెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు కొక్కిరాల సురేఖ, పట్టణ అధ్యక్షులు తూముల నరేష్ పాల్గొన్నారు.

# కాగ్ చీఫ్‌గా సంజయ్ మూర్తి




**బలగం టీవీ, హైదరాబాద్**

కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్)గా ఏపీకి చెందిన సీనియర్ ఐఏఎస్ అధికారి కొండ్రు సంజయ్ మూర్తి బాధ్యతలు స్వీకరించారు. గురువారం రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆయన చేత ప్రమాణ స్వీకారం చేయించారు. దీంతో కాగ్ అధిపతి పదవిని చేపట్టిన తొలి తెలుగు వ్యక్తిగా సంజయ్ మూర్తి నిలిచారు. 1996లో కాంగ్రెస్ నుంచి అమలాపురం ఎంపీగా ఎన్నికైన కెఎస్ఆర్ మూర్తి కుమారుడే సంజయ్‌మూర్తి. 1964 డిసెంబర్ 24న జన్మించిన ఈయన, మెకానికల్ విభాగంలో ఇంజనీరింగ్ పూర్తి చేశారు. 1989లో ఐఏఎస్‌లో హిమాచల్‌ప్రదేశ్ కేడర్‌కు ఎంపికయ్యారు. ఆ తరువాత కేంద్ర సర్వీసుల్లోకి వచ్చిన ఆయన, 2021 సెప్టెంబర్ నుంచి ఉన్నత విద్యా కార్యదర్శిగా పని చేశారు. వచ్చే నెలలో ఉద్యోగ విరమణ చేయాల్సిన ఆయనకు కేంద్ర ప్రభుత్వం కాగ్ బాధ్యతలను అప్పగించింది. ఆయన ఈ పదవిలో గరిష్టంగా ఆరేండ్లు లేదా ఆయనకు 65 ఏండ్ల వయస్సు వచ్చే వరకు కొనసాగనున్నారు.

# మంత్రి కొండా సురేఖపై పరువు నష్టం కేసులో 28న తీర్పు

**బలగం టీవీ, హైదరాబాద్**





మంత్రి కొండా సురేఖపై నటుడు అక్కినేని నాగార్జున దాఖలు చేసిన పరువునష్టం కేసులో ఇరుపక్షాల వాదనలు ముగిశాయి. ఈ కేసులో తీర్పు ఈ నెల 28న వెలువడనుంది. ప్రజాప్రతినిధుల కోర్టులో గురువారం జరిగిన విచారణ సందర్భంగా నాగార్జున తరఫున న్యాయవాది అశోక్‌రెడ్డి వాదనలు వినిపించారు. మంత్రి చేసిన అనుచిత వ్యాఖ్యలు పత్రికలు, టీవీ చానళ్లు సహా సామాజిక మాధ్యమాల్లో వచ్చాయని, దీంతో నాగార్జున కుటుంబం పేరు ప్రతిష్ఠలు దెబ్బతిన్నాయని చెప్పారు. మంత్రి సురేఖ తరఫున సీనియర్ న్యాయవాది మస్తాన్‌నాయుడు వాదనలు వినిపించారు. వాదనలు ముగిసిన అనంతరం మేజిస్ట్రేట్ శ్రీదేవి తీర్పును రిజర్వు చేస్తూ కేసు వాయిదా వేశారు.

ఇక కొండా సురేఖపై కేటీఆర్ దాఖలు చేసిన రూ.100 కోట్ల పరువు నష్టం దావాపై సిటీ సివిల్ కోర్టు విచారణ చేపట్టింది. ఈ కేసులో కోర్టు ఇప్పటికే సురేఖకు నోటీసులు జారీచేసింది. తదుపరి విచారణను డిసెంబర్ 13కు వాయిదా వేసింది. సోషల్ మీడియా, టీవీల్లో, పత్రికల్లో ప్రసారమైన వార్తలను తొలగించాలని, మరోసారి వార్తను ప్రసారం చేయకూడదని కోర్టు ఆదేశించింది. కేసు నమోదు సమయంలో కోర్టుకు రూ. కోటి ఫీజును కేటీఆర్ చెల్లించారు.

# రఘువంశీ ఏరోస్పేస్ నూతన కర్మాగారం నిర్మాణానికి శంకుస్థాపన

**బలగం టీవీ, హైదరాబాద్**

రఘువంశీ సంస్థ నూతన కర్మాగారం నిర్మాణానికి శంషాబాద్ ఏరోస్పేస్ పార్క్‌లో ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు శంకుస్థాపన చేశారు. రూ.300 కోట్ల వ్యయంతో 2 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మితమయ్యే ఈ పరిశ్రమ రానున్న మూడేళ్లలో 1200 మందికి ఉద్యోగావకాశాలు కల్పిస్తుందని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు. రఘువంశీ ఏరోస్పేస్ చేతిలో ఉన్న రూ.2 వేల కోట్ల ఆర్డర్లకు సంబంధించిన పరికరాలను ఈ కొత్త సదుపాయంలో ఉత్పత్తి చేయనున్నట్లు తెలిపారు. 2002లో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమగా ప్రారంభమైన రఘువంశీ ప్రస్థానం ప్రపంచ ప్రఖ్యాత విమాన తయారీ సంస్థలకు ఫ్యూయల్ పంపులు, ల్యాండింగ్ గేర్ల లాంటి ముఖ్య పరికరాలను ఉత్పత్తి చేసే స్థాయికి చేరి ఏరోస్పేస్ రంగంలో రాష్ట్ర ప్రతిష్టను ఇనుమడింప చేసిందని శ్రీధర్ బాబు ప్రసంశించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన ఎంఎస్ఎంఇ పాలసీ ప్రకారం ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాల్లో ఏర్పాటు చేసే పరిశ్రమలకు ప్రోత్సాహకాలు అందిస్తామని ఆయన వెల్లడించారు.